సాక్షి
కాకినాడ
సోమవారం । 3 । ఫిబ్రవరి । 2025



నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం


అన్నవరం: సత్యదేవుని సన్నిధిలో నిత్యాన్నదాన పథకానికి వీరవెంకట సత్యనారాయణ, వాణి దంపతులు (కాకినాడ) ఆదివారం రూ.లక్ష విరాళం సమర్పించారు.



రూ.లక్ష సమర్పణ

సామర్లకోట: కుమారారామ భీమేశ్వరస్వామి ఆలయంలో అన్నదానానికి ఏపీ ఈపీడీసీఎల్ ఈఈ జె.రామారావు, వాణి దంపతులు (రాజమహేంద్రవరం) ఆదివారం రూ.1,00,116 విరాళం సమర్పించారు.

సాగుకు 7,800 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు ఆదివారం 7,800 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 2,300, మధ్య డెల్టాకు 1,500, పశ్చిమ డెల్టాకు 4,000 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 8.90 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

తీర పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

కాకినాడ రూరల్: తీర ప్రాంత పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని ఫారెస్ట్ రేంజ్ అధికారి ఎస్ ఎస్ఆర్ వరప్రసాద్ అన్నారు. ప్రపంచ చిత్తడి నేలల పరిరక్షణ దినోత్సవం సందర్భంగా అటవీ శాఖ, ఆంధ్రప్రదేశ్ నేషనల్ గ్రీన్ కోర్ సంయుక్త ఆధ్వర్యంలో సూర్యారావుపేట ఎన్టీఆర్ బీచ్‌లో ఆదివారం పరిశుభ్రత కార్యక్రమం చేపట్టారు. బీచ్‌లో చెత్త తొలగించారు. ఈ సందర్భంగా వరప్రసాద్ మాట్లాడుతూ, సముద్ర తీరం పరిశుభ్రంగా ఉండాలని అన్నారు. జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్ వినీల్ మాట్లాడుతూ, ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా తగ్గించాలన్నారు. కార్యక్రమంలో ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె.కరుణ, ఐక్యరాజ్య సమితి అభివృద్ధి కార్యక్రమం జిల్లా సమన్వయకర్త శ్రీహర్ష, ఫారెస్ట్ సెక్షన్ అధికారి సింగం వీరభద్రరావు, ఏపీ నేషనల్ గ్రీన్ కోర్ జిల్లా సమన్వయకర్త మహేశ్వరరావు, క్లస్టర్ కోఆర్డినేటర్ వీరభద్రరావు, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

కోడ్ ముగిసే వరకూ పీజీఆర్ఎస్ రద్దు

కాకినాడ సిటీ: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిసేంత వరకూ జిల్లాలో ప్రతి సోమవారం జిల్లా, మండల స్థాయిలో నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని రద్దు చేశారు. జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి ఆదివారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. ఎవరైనా తమ సమస్యలపై ఫిర్యాదు చేయాలనుకుంటే సంబంధిత సచివాలయాల్లో మీకోసం పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పోలీస్ స్పందన రద్దు

కాకినాడ క్రైం: ప్రతి సోమవారం నిర్వహిస్తున్న పోలీస్ గ్రీవెన్స్ కార్యక్రమాన్ని పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిసేంత వరకూ రద్దు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ బిందుమాధవ్ తెలిపారు.

కావాలి లక్ష్మీ కటాక్షం

- 2025–26 బడ్జెట్‌పై అన్నవరం దేవస్థానం కసరత్తు
- ఆదాయం కనీసం 10 శాతం పెంచడంపై దృష్టి
- ఖర్చులు భారీగా కుదించాలని నిర్ణయం!
- రూ.5 కోట్లయినా మిగులు ఉండేలా ప్రయత్నాలు





అన్నవరం దేవస్థానం

అన్నవరం: ఆశించిన స్థాయిలో పెరగని ఆదాయం.. ఇబ్బడిముబ్బడిగా పెరిగిన ఖర్చులు.. ప్రతి నెలా జీతాలు, ఇతర చెల్లింపుల కోసం నిధులు పోగేస్తే తప్ప ముందుకు నడవని పాలన.. అవన్నీ అయ్యాక మాత్రమే నిర్మాణాలు, ఇతర ఖర్చులపై దృష్టి సారించాల్సిన దుస్థితి అన్నవరం దేవస్థానంలో నెలకొంది. ప్రతి నెలా దేవస్థానంలో జీతాలు, పెన్షన్లు, పారితోషికాల చెల్లింపునకు రూ.6 కోట్లు, ముడిసరకుల కొనుగోళ్లకు రూ.6 కోట్లు కలిపి రూ.12 కోట్లు అవసరం. ఈ పద్దుకే ఏటా రూ.144 కోట్లు అవసరమవుతోంది. ఈ నిధుల సమీకరణతో పాటు ఇతర ఖర్చులకు ఎంత అవసరమవుతాయి.. ఖర్చులు తగ్గించే అవకాశాలేవైనా ఉన్నాయా.. అదనపు ఆదాయం తెచ్చుకునేందుకు ఏం చేయాలనేదానిపై అధికారులు కసరత్తు చేస్తున్నారు. దీనిపై దేవస్థానంలోని ముఖ్య విభాగాల్లో పని చేస్తున్న ఏఈఓలు, సూపరింటెండెంట్లు, ఇంజినీరింగ్ అధికారులతో ఈఓ వీర్ల సుబ్బారావు ఇటీవల ఒక కమిటీ ఏర్పాటు చేసిన విషయం విదితమే. ఈ ఏడాది ఆర్థిక ఇబ్బందులు ఎదురైన నేపథ్యంలో.. ఆదాయం పెంపు, ఖర్చుల తగ్గింపే లక్ష్యంగా.. శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో 2025–26 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ రూపకల్పనకు కసరత్తు చేస్తున్నారు.

గత బడ్జెట్ అంచనాలు తలకిందులు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024–25)లో అన్నవరం దేవస్థానం బడ్జెట్‌ను రూ.11 లక్షలు మాత్రమే మిగులు ఉండేలా రూపొందించారు. రూ.177.25 కోట్ల ఆదాయం, రూ.177.14 కోట్ల వ్యయంతో బడ్జెట్ తయారు చేసి పంపించగా.. స్వల్ప మార్పులతో దేవదాయ శాఖ కమిషనర్ ఆమోదించారు. అయితే బడ్జెట్ అంచనాలు తలకిందులయ్యాయి. అందులో పేర్కొన్న విధంగా ఆదాయం రాలేదు సరికదా ఖర్చులు పెరిగాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మరో రెండు నెలలు మాత్రమే మిగిలి ఉండగా హుండీ ఆదాయం రూ.18 కోట్లు మాత్రమే వచ్చింది. ఇంకా రూ.4 కోట్లు రావాల్సి ఉంది. అలాగే, రూ.300 టికెట్టుతో ప్రదక్షిణ దర్శనం నిలిపివేసి, రూ.200 టికెట్టుతో ప్రత్యేక దర్శనం ఏర్పాటు చేయడంతో ఆ ఆదాయం కూడా తగ్గిపోయింది. లీజుల ద్వారా వచ్చే ఆదాయానికి కూడా గండి పడింది. ఈఓ కార్యాలయం దిగువన మెయిన్ క్యాంటీన్ ద్వారా ఏటా రూ.50 లక్షల నుంచి రూ.కోటి ఆదాయం వచ్చేది. ఆ క్యాంటీన్ వేలం ఆరు నెలలుగా నిలిచిపోయింది. గత ఏడాది బడ్జెట్‌లో ఇంజినీరింగ్ విభాగానికి కేటాయించిన రూ.10 కోట్లు గత నవంబర్ నాటికే ఖర్చయిపోయాయి. దీంతో ఆర్థిక సంవత్సరంలో మిగిలిన 4 నెలల ఖర్చులకు సప్లిమెంటరీ బడ్జెట్ పంపించాల్సి వచ్చింది.

2024–25 బడ్జెట్‌లో వివిధ పద్దుల వారీగా ఆదాయ, వ్యయాలు (రూ.కోట్లలో)

ఆదాయం	
వ్రత విభాగం	42.00
ప్రసాద విక్రయాలు	25.00
హుండీల ఆదాయం	22.00
సత్రాల అద్దెలు	10.00
దుకాణాల లీజులు	19.00
వ్యయం	
జీతభత్యాలు, పెన్షన్లు	41.30
ముడిసరకుల కొనుగోళ్లు	35.00
పురోహితులు, ప్రసాదం ప్యాకర్లు, నాయీబ్రాహ్మణుల పారితోషికాలు	21.50
కామన్ గుడ్ ఫండ్ చెల్లింపులు	19.50
ఇంజినీరింగ్ విభాగం	10.00
విద్యుత్ విభాగం	4.50
దత్తత ఆలయాలకు	5.00
సెక్యూరిటీ విభాగం	4.50
శానిటేషన్‌కు	6.00
ఇతరాలు	40.000

ప్రభుత్వ నిర్ణయాలతో భారం

- టీటీడీ నెయ్యి వివాదం సాకుతో రాష్ట్రంలోని అన్ని దేవస్థానాల్లో ఆవు నెయ్యిని టెండర్ ద్వారా కాకుండా సహకార డెయిరీల నుంచి కొనుగోలు చేయాలని కూటమి ప్రభుత్వం ఆదేశించింది. నాలుగు నెలలుగా ఇదేవిధంగా కొనుగోలు చేయడంతో అన్నవరం దేవస్థానానికి రూ.80 లక్షలు అధికంగా వ్యయమైంది.
- అలాగే, బియ్యం, పప్పులు, నూనె, ఇతర ముడి సరకులను ఆరు నెలలకొకసారి టెండర్ ద్వారా దేవస్థానం కొనుగోలు చేసేది. అయితే రాష్ట్రమంతా ఒకే యూనిట్‌గా కొనుగోలు చేస్తామని ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. ఫలితంగా దేవస్థానం గత అక్టోబర్‌లో వీటి కొనుగోళ్లకు టెండర్లు పిలవలేదు. వాస్తవానికి ఆరు నెలలకోసారి టెండర్ ద్వారా కొనుగోలు చేస్తే రేట్లు తగ్గుతాయి. కానీ ప్రభుత్వ నిర్ణయం వలన పాత టెండర్‌దార్ల వద్దనే కొనుగోలు చేయాల్సిన పరిస్థితి.
- శానిటరీ, సెక్యూరిటీ టెండర్లు కూడా ఏ దేవస్థానానికి ఆ దేవస్థానం కాకుండా రాష్ట్రమంతా ఒకే యూనిట్‌గా పిలిచి, అదే రేట్లకు ఆయా దేవస్థానాలు చెల్లించేలా ప్రభుత్వం ఏర్పాటు చేయనుంది. దీని వలన రాబోయే రోజుల్లో దేవస్థానంపై చాలా భారం పడే అవకాశం ఉంది.

రూ.190 కోట్లతో కొత్త బడ్జెట్?

వచ్చే ఆర్థిక సంవత్సరం (2025–26) బడ్జెట్‌లో అంచనాలు సుమారు 10 శాతం పెరిగే అవకాశముంది. 2024–25 బడ్జెట్‌లో ఆదాయం అంచనా రూ.177.14 కోట్లు కాగా, ఈసారి రూ.190 కోట్లకు పెరుగుతుందని భావిస్తున్నట్లు సమాచారం. రూ.300 వ్రతం టికెట్టును రూ.500కు పెం, కాటేజీలు, సత్రాల అద్దెల పెంపు వంటి అంశాలను కూడా పరిశీలిస్తున్నారు.

ఖర్చులు మాత్రం గత ఏడాది కన్నా తగ్గించే ఆలోచనలో ఉన్నారు. ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి రూ.11.50 కోట్లతో సీతారామ సత్రంలో 105 గదులతో ఒక బ్లాక్ నిర్మాణానికి టెండర్లు పిలిచారు. అది తప్ప మిగిలిన నిర్మాణాలేవీ ఈ ఏడాది చేపట్టే అవకాశం లేదు. అలాగే, ఎస్టాబ్లిష్‌మెంట్ చార్జీలు కూడా తగ్గించే యోచనలో ఉన్నారు. మొత్తం మీద కనీసం రూ.5 కోట్లయినా మిగిలేలా బడ్జెట్ రూపొందించాలని కసరత్తు చేస్తున్నారు.

ఆదాయం పెంపు.. ఖర్చు తగ్గింపుపై దృష్టి



దేవస్థానం ఆర్థిక పరిస్థితిని మెరుగుపరిచేలా, సాధ్యమైనంతగా ఖర్చులు తగ్గించేందుకు ప్రయత్నిస్తున్నాం. ఇప్పటికే దీనిపై సలహాలివ్వాలని దేవస్థానం ఏఈఓలు, ఇంజినీర్లు, సూపరింటెండెంట్లతో కమిటీ ఏర్పాటు చేశాం. ఈ నెల 8న భీష్మ ఏకాదశి, 12న మాఘ పౌర్ణమి సందర్భంగా ఆ ఏర్పాట్లపై దృష్టి సారించాం. తరువాత బడ్జెట్‌పై పూర్తిగా దృష్టి పెడతాం.

– వీర్ల సుబ్బారావు, ఈఓ, అన్నవరం దేవస్థానం

రాబడి పెంచేలా నిర్ణయాలు



సాధ్యమైనంత వరకూ ఖర్చులు తగ్గించేందుకు ప్రయత్నిస్తున్నాం. ప్రస్తుతం దేవస్థానానికి వస్తున్న ఆదాయం, జరుగుతున్న ఖర్చు సమానంగా ఉన్నాయి. భవిష్యత్తులో కొన్ని అవసరాలకు నిధులు కేటాయించాల్సి ఉంది. అందువలన ఆదాయం పెంచుకునే దిశగా కొన్ని నిర్ణయాలు తీసుకుంటాం.

– ఐవీ రోహిత్, చైర్మన్, అన్నవరం దేవస్థానం

పని చేయించుకుని.. పైసలు ఎగ్గొట్టి..

- పాదగయలో గత శివరాత్రికి పనులు చేసిన కూలీలు
- ఇప్పటికీ కూలి చెల్లించని అధికారులు
- రెక్కల కష్టం కోసం ఏడాదిగా శ్రమజీవుల ప్రదక్షిణలు



పిఠాపురం మున్సిపల్ కార్యాలయం

పిఠాపురం: రెక్కలు ముక్కలు చేసుకుంటూ ఏ పూటకాపూట కుటుంబాన్ని గడుపుకొనే రోజు కూలీలు వారు. నాలుగు డబ్బులొస్తాయనే ఆశతో చెమటోడ్చి పని చేశారు. ఆ పనులు పూర్తయి రోజులు, వారాలు, నెలలు కాదు.. ఏకంగా ఏడాది కావస్తోంది. కానీ, వారికి అధికారులు ఇప్పటికీ ఒక్క పైసా కూడా కూలి చెల్లించలేదు. దీనిపై ఆ శ్రమజీవులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వివరాలివీ..

గత ఏడాది మహాశివరాత్రి ఉత్సవాలకు పిఠాపురంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం పాదగయలో మున్సిపల్ అధికారులు 30 మంది కూలీలను ఏర్పాటు చేసి, వివిధ పనులు చేయించారు. సుమారు నెల రోజుల పాటు ఉత్సవ ఏర్పాట్లు చేయించుకున్న అధికారులు.. పనులు పూర్తయ్యాక వేతనాలు ఇస్తామని నమ్మబలికారు. తీరా పనులు పూర్తయ్యాక డబ్బులివ్వకుండా ఏడాది కాలంగా తిప్పుతున్నారు. చేసిన పనులకు సంబంధించి తమకు రూ.4.90 లక్షలు కూలి డబ్బులు చెల్లించాల్సి ఉన్నా అధికారులు స్పందించడం లేదని ఇందిరా నగర్‌కు చెందిన దాకే బలాదూర్, ఆలపు గణేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అంశాన్ని కౌన్సిలర్ బోను దేవ ఇటీవల మున్సిపల్ బడ్జెట్ సమావేశంలో కౌన్సిల్ దృష్టికి తీసుకుని వచ్చారు. ఏడాది అవుతున్నా కూలీలకు డబ్బులు ఎందుకు ఇవ్వలేదని అధికారులను నిలదీశారు. ఆడిట్ అధికారుల అభ్యంతరంతో బిల్లులు పాస్ కాలేదని మున్సిపల్ అధికారులు బదులిచ్చారు. అయితే, తమతో పని చేయించుకుని బిల్లులు పాస్ కాలేదంటే ఎలాగని కూలీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు తమ కూలి డబ్బులు చెల్లించాలని, లేకుంటే ప్రస్తుత శివరాత్రి ఉత్సవాల్లో ఆందోళనకు దిగుతామని హెచ్చరిస్తున్నారు.

తూకం డబ్బులూ తొక్కి పెట్టారు

ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాలతో అధికారులు పారిశుధ్య నిర్వహణకు పెద్ద పీట వేస్తున్నట్లు తీవ్ర ప్రచారం చేశారు. దీనిలో భాగంగా పట్టణంలో రోజుకు ఎంత చెత్త వస్తోంది.. దానిని తొలగించడానికి ఎంత ఖర్చవుతుంది.. ఎంత మంది పారిశుధ్య కార్మికులు అవసరమవుతారనే అంశాలను నిర్ధారించేందుకు పట్టణంలో తయారైన చెత్తను తూకం వేయించారు. ఇది జరిగి నెలలు గడుస్తున్నా తమకు సుమారు రూ.60 వేల వరకూ తూకం డబ్బులు చెల్లించలేదని వేబ్రిడ్జి యజమాని మురళి వాపోతున్నారు. ఎన్నిసార్లు అడిగినా ఇస్తామంటున్నారే తప్ప ఇవ్వడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఆడిట్ అభ్యంతరం అంటే ఎలా?

కూలీల డబ్బులు చెల్లించడానికి పెట్టిన బిల్లును ఆడిట్ అధికారులు అభ్యంతరం చెబుతూ వెనక్కి పంపించేస్తున్నారని కౌన్సిల్ సమావేశం సాక్షిగా అధికారులు చెప్పారు. అయితే, కూలీలతో పనులు చేయించేటప్పుడు ఎక్కువ మొత్తం ఖర్చయితే ఆడిట్ అభ్యంతరం వస్తుందనే విషయం అధికారులకు ముందుగా తెలియదా అనే ప్రశ్న తలెత్తుతోంది. ఆడిట్ అభ్యంతరాలు ఎదురయ్యేలా అంతమందితో అన్ని రోజులు ఎందుకు పని చేయించారని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఉన్న పారిశుధ్య సిబ్బందితో పని చేయించకుండా కూలీలను పెట్టి పని చేయించుకుని, ఇప్పుడు వారికి డబ్బులివ్వడానికి ఆడిట్‌ను సాకుగా చూపించడమేమిటని అంటున్నారు. అయితే, త్వరలోనే కూలీల డబ్బులు చెల్లించడానికి చర్యలు తీసుకుంటున్నామని కమిషనర్ కనకారావు తెలిపారు.

పరీక్షా కాలం

- ఇంటర్ విద్యార్థులకు నేడు ఎన్విరాన్‌మెంట్ పరీక్ష
- 5 నుంచి ప్రాక్టికల్స్
- మార్చి 1 నుంచి థియరీ పరీక్షలు



బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఇంటర్మీడియెట్ విద్యార్థులకు పరీక్షా కాలం మొదలైంది. వార్షిక పరీక్షల్లో భాగంగా సోమవారం ఎన్విరాన్‌మెంట్ పరీక్ష నిర్వహించనున్నారు. జిల్లాలో గుర్తింపు పొందిన కళాశాలల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ జరిగే ఈ పరీక్షకు ఫస్టియర్ విద్యార్థులు 22,260 మంది హాజరు కానున్నారు. మానవీయ విలువలు, పర్యావరణ విద్య వంటి అంశాల్లో విద్యార్థులకు ఏమేరకు అవగాహన ఉందో తెలుసుకునేందుకు ఈ పరీక్ష నిర్వహిస్తున్నారు. విద్యార్థులందరూ ఈ పరీక్ష రాయాల్సిందేనని ఇంటర్ బోర్డు అధికారులు ఆదేశాలు జారీ చేశారు. పరీక్ష ప్రారంభానికి ముందు ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్ల ఈ–మెయిల్‌కు ప్రశ్నపత్రం నేరుగా పంపించనున్నారు. ప్రిన్సిపాల్ సెల్‌ఫోన్‌కు వచ్చే ఓటీపీ ద్వారా ప్రశ్నపత్రం డౌన్‌లోడ్ చేసుకుని, పరీక్ష నిర్వహించాలి.

జిల్లాలో ఇంటర్ విద్యార్థులు, పరీక్ష కేంద్రాలు, కళాశాలల వివరాలు

ఫస్టియర్	22,260
సెకండియర్	21,871
పరీక్ష కేంద్రాలు	56
ఫ్లయింగ్ స్క్వాడ్	3
ప్రభుత్వ కళాశాలలు	15
హైస్కూల్ ప్లస్	14
మోడల్ స్కూల్	2
కేజీబీవీ	4
ఏపీఎస్‌డబ్ల్యూఆర్	8
ప్రైవేటు ఎయిడెడ్	4
ప్రైవేటు అన్ ఎయిడెడ్	99

నిఘా నీడలో ప్రాక్టికల్స్

ఇదిలా ఉండగా ఈ నెల 5 నుంచి ఇంటర్ ఒకేషనల్ విద్యార్థులకు, 10 నుంచి జనరల్ విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. రోజూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ, తిరిగి మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ ఈ పరీక్షలు నిర్వహించనున్నారు. మొత్తం 89 కేంద్రాల్లో 21,871 మంది విద్యార్థులు ప్రాక్టికల్ పరీక్షలకు హాజరు కానున్నారు. ప్రతి కేంద్రంలో నిఘాకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. వీటి ద్వారా పరీక్షలు జరుగుతున్న తీరును ఇంటర్ బోర్డు ఉన్నతాధికారులు ప్రత్యక్షంగా వీక్షించనున్నారు. మరోవైపు మార్చి 1 నుంచి వార్షిక (థియరీ) పరీక్షలు ప్రారంభం కానున్నాయి. జిల్లాలోని 146 కళాశాలల్లో మొదటి, రెండో సంవత్సరం చదువుతున్న 44,131 మంది విద్యార్థులు ఈ పరీక్షలు రాయనున్నారు.

పక్కాగా పర్యవేక్షణ



ఇంటర్ పరీక్షలు పక్కాగా నిర్వహించేందుకు ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్ బాధ్యత తీసుకోవాలి. ఎలాంటి పొరపాట్లు జరిగినా ఉపేక్షించేది లేదు.

– జీజీకే నూకరాజు, జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాశాఖాధికారి, కాకినాడ



మంచు తరుణం

మంచు దుప్పటి కప్పుకున్న భువిలా.. చల్లగా చల్లిన మంచు ముత్యాల్లా.. ధవళవర్ణ దారుల్లా.. సూర్యుడు సిగ్గుపడి దాక్కునేలా.. చూసిన వారి మది మురిసేలా.. హిమసోయగం ముచ్చట గొలిపింది. ప్రకృతి ప్రేమికులకు కనువిందు చేసింది. కాకినాడ జిల్లా ఉప్పాడ తీర ప్రాంతాన్ని ఆదివారం పొగ మంచు కప్పేసింది. ఉదయం 10 గంటలైనా సూరీడు కానరాలేదు. మంచు వాన కురిసింది. కోనసీమ జిల్లా కొత్తపేట నియోజకవర్గంలోనూ పొగ మంచు చిరుజల్లులా పడింది. రోడ్లపై రాకపోకలు సాగించే వారికి దారిని కనిపించకుండా చేసింది. పగలూ లైట్ల వెలుతురులో రాకపోకలు సాగించాల్సి వచ్చింది. ఆత్రేయపురం మండలం వాడపల్లి వేంకటేశ్వర స్వామివారి క్షేత్రాన్ని మంచుతెర కప్పేసింది. ఆ క్షేత్రానికి తెల్లవారుజాము నుంచీ వచ్చిన భక్తులు మంచులో తడిసిపోయారు. ఆలమూరు 216ఏ జాతీయ రహదారితో పాటు మండపేట–జొన్నాడ, కొత్తూరు– వెదురుమూడి రోడ్డులో పొగ మంచు కురిసింది.

– పిఠాపురం/కొత్తపేట/ఆలమూరు


ఉప్పాడలో మంచు దుప్పటి కప్పుకున్న మత్స్యకారుల బోట్లు


కొత్తపల్లిలో ఇళ్లు కనిపించలేనంతగా కమ్మేసిన మంచు


వాడపల్లి వెంకన్న ఆలయంపై మంచు తెర


మసకేసిన ఉప్పాడ బీచ్ రోడ్డు


కొత్తపేట కౌశిక రోడ్డులో లైట్ల వెలుగులో వెళ్తున్న వాహనదారులు


పినపళ్లలో చెరువు వద్ద ప్రకృతి 'స్నో'యగం


పెదపళ్లలోని పుంత రోడ్డులో..

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	14,000 – 14,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 – 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	20,000
గటగట (వెయ్యి)	17,500
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	19,000
గటగట (వెయ్యి)	17,000
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	13,000 – 14,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	14,000 – 14,500
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

పొగాకు బ్యారన్ దగ్ధం

దేవరపల్లి: యర్నగూడెం పంచాయతీ పరిధి సూర్యనారాయణపురంలో ఆదివారం పొగాకు బ్యారన్ దగ్ధమైంది. గ్రామానికి చెందిన రైతు పుట్టా రామారావుకు చెందిన బ్యారన్‌లో మంటలు వ్యాపించడంతో క్యూరింగ్‌లో ఉన్న పొగాకు కాలిపోయినట్టు గుర్తించారు. ఈ ప్రమాదంలో సుమారు రూ. 6 లక్షల ఆస్తినష్టం సంభవించినట్లు రామారావు వివరించారు. కొవ్వూరు అగ్నిమాపక అధికారులు వచ్చి మంటలను అదుపు చేశారు.

మాధవా.. ఇటు చూడవా!

- కల్యాణోత్సవాల వేళ కళావిహీనంగా పిఠాపురం కుంతీమాధవుని ఆలయం
- ఆదాయం లేదని పాలకుల శీతకన్ను!

పిఠాపురం: ఆస్తులుంటేనే అతిథులొస్తారు.. బెల్లం ఉంటే చీమలు చేరుతాయనేది ఎంత నిజమో ఆస్తులుంటేనే దేవుడినైనా పట్టించుకుంటారనేది అంత నిజమని తేలింది. మాధవుడైతే మాకేంటి అన్న ధోరణిలో దేవదాయ ధర్మదాయ శాఖాధికారులు ఉన్నారు. రూ.కోట్ల విలువైన ఆస్తులు అన్యాక్రాంతం అవుతున్నా అధికారులు పట్టించుకోవడం మానేశారు. ఆదాయాలు వచ్చే ఆలయాలపై ఎక్కడలేని భక్తి చూపించే దేవదాయ శాఖ పిఠాపురం కుంతీ మాధవస్వామి ఆలయం విషయంలో మాత్రం శీతకన్ను వేసింది. ఏడాదికి ఒకసారి జరిగే దివ్య కల్యాణానికి కనీస ఏర్పాట్లు చేయకపోవడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది.

ఎంతో ప్రాధాన్యం ఉన్నా..

పంచ మాధవ క్షేత్రాల్లో కుంతీమాధవుడు ఒకరు. దేశంలో ఉత్తరప్రదేశ్‌లోని వారణాశిలో బిందుమాధవ క్షేత్రం, అలహాబాద్‌లోని ప్రయాగలో వేణుమాధవ క్షేత్రం, పిఠాపురంలో కుంతీమాధవ క్షేత్రం, తమిళనాడులోని రామేశ్వరంలో సేతు మాధవక్షేత్రం, కేరళలోని తిరువనంతపురంలో సుందరమాధవ క్షేత్రం పంచమాధవ క్షేత్రాలుగా వెలుగొందుతున్నాయి. త్రేతాయుగంలో శ్రీరాముడు ఈ క్షేత్రాన్ని దర్శించినట్లు శాసనాలున్నాయి. ఇక్కడ ఆదికాలంలో పాండవుల వనవాస సమయంలో కుంతీదేవి పాండవుల క్షేమం కోసం మహా విష్ణువును ప్రార్థించగా ఆయన సాక్షాత్కరించి అనుగ్రహించడం వల్ల ఈ స్వామికి కుంతీమాధవ స్వామిగా పేరొచ్చినట్లు చరిత్ర చెబుతోంది. అలాగే కుంత అనే ఆయుధం కలిగి ఉండడం వల్ల కూడా కుంతీ మాధవస్వామిగా పేరొందినట్లు చెబుతుంటారు. ఇక్కడ అమ్మవారు రాజ్యలక్ష్మిగా పూజలందుకుంటున్నారు. అటువంటి అత్యంత ప్రాచీన ఆలయాన్ని ఒక్క నాయకుడూ



పట్టించుకోడం లేదు. మరో మూడు రోజుల్లో కల్యాణోత్సవాలు ప్రారంభం కానున్నా ఏ ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టి పెట్టడం లేదు. ఇదిలా ఉంటే రూ.కోట్లు వచ్చే కుక్కుటేశ్వరునిపైనే అందరూ దృష్టి పెడుతున్నారు. పాదగయలో మహా శివరాత్రి ఉత్సవాలు ఇంకా 20 రోజులకు పైగా ఉన్నా ఇప్పటి నుంచే ఏర్పాట్లు చేయడం విశేషం. ఈ నెల 6వ తేదీ నుంచి ఉత్సవాలు ప్రారంభం కానున్న కుంతీ మాధవుని ఆలయాన్ని మాత్రం పట్టించుకోవడం లేదు. స్థానిక ఎమ్మెల్యే, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కూడా ఈ ఆలయం గురించి పట్టించుకోకపోవడం సరికాదని భక్తులు అంటున్నారు. ఆదాయాలున్న ఆలయాలు ఎలాగన్నా అభివృద్ధి చెందుతాయని, ఆదాయం లేని ఆలయాలను ఉద్ధరించినప్పుడే నిజమైనన సనాతన ధర్మాన్ని కాపాడిన వారవుతామని చెబుతున్నారు.


ఆస్తులు అన్యాక్రాంతం

పిఠాపురంలో అతి ప్రాచీన కుంతీమాధవస్వామి ఆలయం శిథిలావస్థలో కొట్టుమిట్టాడుతోంది. సుమారు రూ.100 కోట్లకు పైగా విలువైన ఆస్తులు, ఆభరణాలున్న ఈ ఆలయానికి సంబంధించిన భూములు అన్యాక్రాంతమైనా దేవదాయ శాఖ పట్టించుకోకపోవడం శోచనీయం. దీంతో స్వామివారికి నిత్య ధూప దీప నైవేద్యాలకు ఇబ్బందులు ఎదురవుతుండగా, ఆలయ సిబ్బందికి జీతభత్యాలు ఏళ్ల తరబడి పేరుకుపోయాయి. కుంతీ మాధవస్వామి ఆలయ కోనేరు అభివృద్ధికి నోచుకోక కంపు కొడుతోంది. ప్రస్తుతం ధనుర్మాస ఉత్సవాలు ముగియగా, ఈ నెల 6 నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. అయినా ఆదాయ వనరులు అధికంగా ఉన్న కుక్కుటేశ్వరస్వామి ఆలయంపై చూపుతున్న శ్రద్ధ ఈ ఆలయంపై చూపకపోవడం పట్ల భక్తులు మండిపడుతున్నారు. ఈ ఆలయానికి భూముల శిస్తు ద్వారా 40 బస్తాల ధాన్యం, హుండీ ద్వారా రూ.90 వేలు, ఖాళీ స్థలాలు, కల్యాణాల ద్వారా రూ.2.50 లక్షల ఆదాయం వస్తుంది. భక్తులు కల్యాణం కోసం రూ.లక్ష డిపాజిట్ చేయగా, ఆ సొమ్ముతోనే కల్యాణం చేసి చేతులు దులుపుకోవడం తప్ప పూర్తి స్థాయిలో ఉత్సవాలు చేయలేని ఆ శాఖ తీరుపై సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది.

ఉన్నంతలో ఘనంగా నిర్వహిస్తాం

> దేవదాయ ధర్మదాయ శాఖ ఆదేశాల మేరకు మాత్రమే ఆలయాన్ని నిర్వహిస్తున్నాం. ఉత్సవాలకు ఏమీ ఇబ్బంది ఉండదు. సంవత్సరానికి భూములు, కల్యాణాలు, హుండీల ద్వారా రూ.4 లక్షల ఆదాయం వస్తుంది. వాటితోనే ఉత్సవాలు, ఆలయ నిర్వహణ చేయాల్సి ఉంది. ఉన్నంతలో ఉత్సవాలు ఘనంగా చేయడానికి కృషి చేస్తున్నాం.
>
> – నున్న శ్రీరాములు, ఈఓ, కుంతీ మాధవస్వామి ఆలయం, పిఠాపురం


కళావిహీనంగా కుంతీ మాధవస్వామి ఆలయం


ఆలయ ప్రాచీనతను తెలిపే శాసనం

రైల్వే స్టేషన్‌ను సుందరంగా తీర్చిదిద్దండి


సామర్లకోట రైల్వే స్టేషన్‌లో సూచనలు చేస్తున్న డీఆర్ఎం నరేంద్ర ఆనంద్ పాటిల్

సామర్లకోట: స్థానిక రైల్వే స్టేషన్‌ను సుందరంగా తీర్చిదిద్దాలని డివిజనల్ రైల్వే మేనేజర్ నరేంద్ర ఆనంద్‌పాటిల్ సూచించారు. సామర్లకోటకు వచ్చిన ఆయనకు స్టేషన్ మేనేజర్ ఎం.రమేష్ స్వాగతం పలికారు. రైల్వే స్టేషన్‌లో అమృత్ భారత్ నిధులతో జరుగుతున్న అభివృద్ధి పనులను డీఆర్ఎం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా అభివృద్ధి పనులు చేయాలని అన్నారు. ఈ పనులకు సంబంధించిన మ్యాప్, ఫొటో ఎగ్జిబిషన్‌ను ఆయన పరిశీలించి, పనుల తీరును తనిఖీ చేశారు. బుకింగ్ కౌంటర్ హాల్ గోడలపై స్టిక్కర్లు అతికించి ఉండటంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. కౌంటర్ హాల్ సుందరంగా ఉండేలా రంగులు వేయించాలన్నారు. సిగ్నల్ వ్యవస్థలో లోపాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సమస్యలు రాకుండా చేయడానికి కావాల్సిన సదుపాయాలను అడిగారు. రైల్వే ట్రాక్‌ను తరచూ ఇంజినీరింగ్ సిబ్బంది తనిఖీలు చేయాలని సూచించారు. కార్ల పార్కింగ్ ప్రదేశాన్ని, రైల్వే క్వార్టర్స్‌ను ఆయన పరిశీలించారు. ప్లాట్‌ఫామ్‌పై షెడ్లు కారిపోతున్నాయని, రైల్వే టైమ్ టేబుల్ మార్పు చేయలేదని ప్రయాణికులు ఫిర్యాదులు చేశారు. వాటిని వెంటనే సరి చేయాలని అధికారులకు డీఆర్ఎం సూచించారు. ఏడీఆర్ఎం కొండా శ్రీనివాస్, సీనియర్ డివిజనల్ ఆపరేషన్ మేనేజర్ నరేంద్ర వర్మ, డివిజనల్ కమర్షియల్ మేనేజర్ అలీఖాన్, సీనియర్ డీఈఎన్‌లు గౌతమ్, ఎం.కిశోర్, సీనియర్ డీఈఈ సురేష్ బాబు, కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Wanted

■ మెకానిక్ హెల్పర్లు కావలెను. జీతము 15000/- నుండి 18,000/- వరకు, శ్రీదేవి హోండా, ఆథరైజ్డ్ డీలర్ : హోండా టూ వీలర్స్, టూ టౌన్ పోలీస్‌స్టేషన్ వద్ద మెయిన్ రోడ్, కాకినాడ. ✆ : 94909 98888 [R-113]

■ KKD foton decors కంపెనీలో పని చేయుటకు ఆఫీస్ బాయ్స్ & మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ (M) కావలెను టూవీలర్ తప్పనిసరి. ✆ : 88826 56789 [R-SCA25001485]

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్‌లో వృద్ధులను, పేషెంట్లను, పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి భోజనం జీ: 18K. Ph: 9640258899, 9640468899 [HA-1397]

■ కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికిస్త్రీలు/పురుషులు, ఆయా, నర్సులు, వంట వారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ:15 వేలు – 40 వేలు, ఫ్రీరూం + భోజనం.HYD. 79935 83999. [HA-99693]

■ సాయిరామ్ హోంకేర్: Hydలో బేబీ కేర్, పేషెంట్‌కేర్, ముసలివారిని చూసుకొనుటకు ఆయాలు/నర్సులు, ఇంటి పని/వంట పనికి మనుషులు (ఆడ/మగ) కావ లెను. జీతం 18,000/- 9666001826, 9666001827 [SCA25001357]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.


పట్టపగలే చోరీ

మూడు గంటల్లో ఛేదించిన పోలీసులు


వివరాలు వెల్లడిస్తున్న రౌతులపూడి ఎస్సై వెంకటేశ్వరరావు

రౌతులపూడి: మండలంలోని గుమ్మరేగుల్లో ఆదివారం పట్టపగలే చోరీ జరిగింది. ఈ ఘటనపై బాధితుడి ఫిర్యాదు ఆధారంగా మూడు గంటల్లోనే నిందితుడిని పోలీసులు పట్టుకున్నారు. వారి కథనం ప్రకారం.. రౌతులపూడి మండలం గుమ్మరేగులకు చెందిన తుమ్మలపల్లి సూరిబాబు తన భార్య, పిల్లలతో కలసి ఉదయం పది గంటలకు గ్రామంలోని ఒక చర్చికి వెళ్లారు. మధ్యాహ్నం ఒంటి గంటకు తిరిగి ఇంటికి వచ్చి చూడగా, తలుపులు తొలగించినట్లు ఉంది. ఇంట్లోకి వెళ్లి చూసేసరికి బీరువాలో ఉంచిన 27 గ్రాముల రెండు బంగారు, 120 గ్రాముల వెండి ఆభరణాలు, రూ.5 వేలు చోరీకి గురైనట్లు గుర్తించారు. దీంతో బాధితుడు రౌతులపూడి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్సై వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి విచారించారు. అక్కడ లభించిన ఆధారాలకు అనుగుణంగా గుమ్మరేగుల గ్రామానికి చెందిన ఒక బాలుడిని నిందితుడిగా గుర్తించారు. ఆ బాలుడిని సాయంత్రం ఆరు గంటల సమయంలో బీబీ పట్నం సెంటర్ వద్ద పట్టుకుని, చోరీకి గురైన సొత్తు స్వాధీనం చేసుకున్నామని ఎస్సై వివరించారు.

రత్నగిరికి పోటెత్తిన భక్తులు


సత్యదేవుని వ్రతాలాచరిస్తున్న భక్తులు

అన్నవరం: మాఘ మాసం తొలి ఆదివారం కావడంతో రత్నగిరికి భక్తులు పోటెత్తారు. ఉదయం నుంచీ భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. ఎక్కువ మంది కార్లు, ఇతర వాహనాల్లో తరలి రావడంతో దేవస్థానంలోని పార్కింగ్ స్థలాలన్నీ వాహనాలతో నిండిపోయాయి. ఆలయం వద్ద రద్దీ ఏర్పడింది. సత్యదేవుని ఉచిత దర్శనానికి గంట, ప్రత్యేక దర్శనానికి అరగంట పట్టింది. స్వామివారిని 30 వేల మంది దర్శించుకున్నారు. రెండు వేల వ్రతాలు నిర్వహించారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.30 లక్షల ఆదాయం సమకూరింది. నిత్యాన్నదాన పథకంలో సత్యదేవుని అన్న ప్రసాదాన్ని సుమారు 5 వేల మంది స్వీకరించారు. ఏర్పాట్లను దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ వీర్ల సుబ్బారావు పర్యవేక్షించారు. ఆలయ ప్రాకారంలో సత్యదేవుని రథసేవ ఘనంగా నిర్వహించారు. సోమవారం సత్యదేవుడు, అమ్మవారు ముత్యాల కవచాలు (ముత్తంగి సేవ) ధరించి, నిజరూపంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు.

పురుగు మందు తాగి యువకుడి ఆత్మహత్య


నిమ్మన శివనాగ కృష్ణ (ఫైల్)

ముమ్మిడివరం: ఓ యువకుడు పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన ముమ్మిడివరం మండలం గేదెల్లంకలో చోటు చేసుకుంది. మృతుడి కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. ముమ్మిడివరం మండలం గేదెల్లంకకు చెందిన నిమ్మన శివనాగకృష్ణ (32) తన భార్య సాయిరేవతి, తల్లిదండ్రులు వెంకటరమణ, శేషగిరిరావులతో కలసి హైదరాబాద్ ఎల్బీనగర్‌లో జ్యూస్ షాప్ పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. అయితే అక్కడ ఓ వివాహిత అదృశ్యం కావడంతో ఆమె భర్త పోలీసు శాఖలో పనిచేయడంతో శివనాగకృష్ణ ప్రమేయం ఉందని పోలీసులు వేధించారని చెబుతున్నారు. దీంతో మనస్తాపం చెంది శనివారం హైదరాబాద్ నుంచి వచ్చిన నాగకృష్ణ పురుగు మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. అతన్ని తొలుత మురమళ్ల ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్య కోసం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. ముమ్మిడివరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆటోను ఢీకొన్న కంటైనర్

- 8 మందికి తీవ్ర గాయాలు
- ఒకరి పరిస్థితి ఆందోళనకరం

అమలాపురం టౌన్: అమలాపురం మార్కెట్ వీధికి చెందిన ఇరుగు పొరుగు కుటుంబాలకు చెందిన పది మంది సరదాగా ఓడలరేవు సముద్ర తీరానికి వెళ్లారు.. అక్కడ ఆనందంగా గడిపి ఆటోలో ఇళ్లకు తిరిగి వస్తుండగా ప్రమాదానికి గురై తీవ్ర గాయాలతో ఆస్పత్రుల పాలయ్యారు. వెళ్లిన పది మందిలో 8 మందికి తీవ్ర గాయాలయ్యాయి. వీరి ఆటో అమలాపురం పట్టణంలోకి ప్రవేశించి కొంకాపల్లి వద్ద 216 జాతీయ రహదారికి వచ్చేసరికి ఎదురుగా వస్తున్న కంటైనర్ బలంగా ఢీకొంది. దీంతో ఆటోలోని వనుం కిశోర్ (16), మానుపాటి నాని (14), మానుపాటి నాగేంద్ర (38), మానుపాటి దుర్గ (33), వనుం కిరణ్ (12), ఆటో డ్రైవర్ మొగిలి మహేష్ (20), నలబ శ్రీదేవి (16), మానుపాటి దివ్య (6) తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదం జరిగిన తక్షణమే స్థానికులు క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో అమలాపురం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి, కిమ్స్ ఆస్పత్రులకు తరలించారు. ఇందులో శ్రీదేవికి తీవ్ర గాయాలు కాగా అపస్మారక స్థితిలోకి వెళ్లింది. ఆమెకు ప్రస్తుతం కిమ్స్ ఆస్పత్రిలో అత్యవసర వైద్యం అందుతోంది. క్షతగాత్రుల్లో కొందరికి రక్తపు గాయాలైతే మరికొందరికి కాళ్లు, చేతులు విరిగిపోయాయి. ప్రమాదానికి కారణమైన కంటైనర్ డ్రైవర్ పశ్చిమ గోదావరి జిల్లా భీమవరానికి చెందిన శ్రీనివాసరావు నేరుగా పట్టణ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు. పట్టణ సీఐ పి.వీరబాబు ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు, గాయాలైన ఓ బాలుడిని ఓదారుస్తున్న తండ్రి


కిమ్స్‌లో అత్యవసర వైద్యం పొందుతున్న శ్రీదేవి

అంతర్ జిల్లాల దొంగ అరెస్ట్

- 48 మోటారు సైకిళ్ల స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ బిందుమాధవ్

పిఠాపురం: ఒకటి కాదు రెండు కాదు ఏకంగా 48 మోటారు సైకిళ్ల చోరీ చేశాడా ఘరానా దొంగ. రెండేళ్లుగా చోరీలు చేస్తూ దమ్ముంటే పట్టుకోండంటూ పోలీసులకు సవాల్ విసిరాడు. ముఖానికి మాస్కులు ధరించి చాకచక్యంగా బైక్‌లను దొంగతనం చేయడం ఆచూకీ లేకుండా పోవడంతో పోలీసులు తలపట్టుకునే పరిస్థితి వచ్చింది. చోరీ చేయడంతో పాటు వాటిని వెంటనే అమ్మి సొమ్ము చేసుకోవడం, జల్సాలు చేయడం ఆ దొంగకు వెన్నతో పెట్టిన విద్య. చోరీలు జరిగిన చోట సీసీ కెమెరాల్లో రికార్డు అవుతున్నా ఆనవాళ్లు లేకుండా పారిపోతూ రెండేళ్లుగా పోలీసులను ముప్పుతిప్పలు పెట్టాడు. ఎట్టకేలకు సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి వల పన్నడంతో పోలీసులకు చిక్కాడు. ఈ సంఘటనకు సంబంధించి కాకినాడ జిల్లా ఎస్పీ బిందుమాధవ్ ఆదివారం పిఠాపురం పట్టణ పోలీసు స్టేషన్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం.. అనకాపల్లి, కాకినాడ, తుని, అన్నవరం, పిఠాపురం, తొండంగి, సర్పవరం, యు.కొత్తపల్లి పోలీసు స్టేషన్ల పరిధిలో రెండేళ్లుగా మోటారు సైకిళ్ల దొంగతనాలు జరుగుతున్నాయి. వాటిపై ఫిర్యాదులు అందుతుండగా విచారణ చేపట్టిన పోలీసులకు సీసీ కెమెరాల్లో కొన్ని ఆధారాలు లభించాయి. అయితే దొంగ మాస్క్ ధరించడంతో పాటు ఎక్కడా ఎటువంటి ఆనవాళ్లు వదలక పోవడంతో నిందితుడిని గుర్తించడం కష్టంగా మారింది. చివరకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి నిందితుడి ఊహాచిత్రాన్ని తయారు చేయించి చూడగా అతడు పాత నేరస్తుడిగా తేలింది. దీంతో నిందితుడి వివరాలను పిఠాపురం పోలీసులు సేకరించారు. నిందితుడు పిఠాపురం అగ్రహారానికి చెందిన సొంటిని గంగాధర్‌గా గుర్తించి ఎట్టకేలకు వల పన్ని ఆదివారం అరెస్ట్ చేసినట్లు ఎస్పీ తెలిపారు. ముద్దాయిపై పలు పోలీస్ స్టేషన్లలో 48 కేసులు నమోదయ్యాయన్నారు. నిందితుడి నుంచి 48 మోటార్ సైకిళ్ల స్వాధీనం చేసుకున్నామని, నిందితుడిని, ఆ మోటారు సైకిళ్లు కొనుగోలు చేసిన ఆరుగురిని పిఠాపురం కోర్టులో హాజరు పరచనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్పీ పాటిల్ దేవరాజ్ మనీష్, సీఐ జి.శ్రీనివాస్, ఎస్సైలు వి.మణికుమార్, గుణశేఖర్, ఎస్‌కే బాషా, జి.వెంకటేష్, ఎస్.రామకృష్ణ, ఎస్.లక్ష్మణస్వామి, ఎస్వీ రాజారావు తదితరులు పాల్గొన్నారు.


కేసు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ బిందుమాధవ్


నిందితుడి నుంచి స్వాధీనం చేసుకున్న వాహనాలు

ఎంతున్నావే ట్యూనా..


కాకినాడలో మత్స్యకారులకు చిక్కిన భారీ ట్యూనా చేప

కాకినాడ రూరల్: ఈ చిత్రంలో కనిపిస్తున్న చేప పేరు ట్యూనా. దీనిని ఎల్లో ఫిన్ ట్యూనా అని కూడా పిలుస్తారు. సుమారు 50 కిలోల బరువున్న ఈ చేప కాకినాడ మత్స్యకారుల వలకు చిక్కింది. దీని ధర రూ.7,500 పలికింది.